






ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 254 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 15 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ప్రముఖ పుణ్యక్షేత్రాలకు రోప్ వే సౌకర్యం

## నంద్యాల జిల్లా అహోబిలం దేవస్థానంకు అందుబాటులో

### గాల్లో తేలినట్టుందే.... అంటూ త్వరలో విహారం

ఏప్రిల్ 15, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. భక్తులు పర్యాటకులు గాల్లో తేలిపోయి త్వరలో ఆనంద విహారం చేస్తారు. ప్రముఖ 5 పుణ్యక్షేత్రాలకు రోప్ వే సౌకర్యం కల్పించనున్నారు. ఈ క్రమంలోనే నంద్యాల జిల్లా అహోబిలం పుణ్యక్షేత్రంలో కూడా రూపే సౌకర్యం త్వరలో భక్తులకు అందుబాటులోకి రానుంది. తీర ప్రాంతంలోని పర్యాటక స్థలాలతో పాటుగా ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా సందర్శకులను ఆకర్షించి ఆదాయం పెంచుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలోనే ఏపీకి కేంద్రం నుంచి ఓ శుభవార్త వచ్చింది. ఏపీలోని ఐదు ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణం కోసం కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా డీపీఆర్‌ల తయారీకి కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు బిడ్లను ఆహ్వానిస్తున్నారు.


అంతెత్తున ఉన్న కొండల మధ్యన వేలాడుతూ గాలిలో విహారం.. తలుచుకుంటేనే ఓ రకమైన థ్రిల్లింగ్ ఫీలింగ్. అలాంటి ఫీలింగ్ వచ్చే రోజుల్లో మీరు కూడా అనుభవించవచ్చు. ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రముఖ పుణ్యక్షేత్రాలకు రూపే సౌకర్యంఆంధ్రప్రదేశ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే ఏపీ పర్యాటక రంగం అభివృద్ధికి ఊతమిచ్చేలా కీలక అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు చోట్ రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. ఏపీలో రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీలో కన్సల్టెన్సీ సర్వీసుల కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ బిడ్లను ఆహ్వానిస్తోంది. ఈ ఐదులో చిత్తూరు జిల్లా బోయకొండ గంగమ్మ ఆలయం, నంద్యాల జిల్లాలోని అహోబిలం పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద దిగువ ఆలయం నుంచి హిల్ టాప్ వరకూ 0.68 కిలోమీటర్ల మేర రోప్‌వే నిర్మాణానికి కసరత్తు జరుగుతోంది. అలాగే అహోబిలం దేవస్థానం వద్ద.. ఎగువ అహోబిలం నుంచి జ్వాల నరసింహస్వామి ఆలయం వరకూ 1.28 కిలోమీటర్లు.. కోటప్పకొండ వద్ద కొండ దిగువ నుంచి ఎగువకు, పాత దేవాలయం వరకూ 1.23 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి.





### కృష్ణ నది మీదుగా భవాని ఐలాండ్ వరకు

అలాగే విజయవాడలో కృష్ణా నది మీదుగా బెర్మ్ పార్క్ నుంచి భవానీ ఐలాండ్ వరకూ 0.85 కిలోమీటర్ల మేరకు రోప్‌వే నిర్మించాలని ప్రణాళికలు రచిస్తున్నారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆలయం ముందు నుంచి శిఖరాగ్రం వరకూ 0.25 కిలోమీటర్లు రోప్‌వే ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్‌ల తయారీలో కన్సల్టెన్సీ సేవల కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.



## మరో 25 పర్యాటక కేంద్రాల్లో కూడా

మరోవైపు ఏపీలోని 25 పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పర్యాటకులతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి సందర్శకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో ఏపీటీడీసీ ఈ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా ప్రముఖ దేవాలయాల వద్ద రోప్ వే లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఏపీటీడీసీ ఉన్నట్లు తెలిసింది. పర్యాటక కేంద్రాలలో రోప్ వే నిర్మాణాలు పూర్తి అయితే పర్యాటకులకు ఇంట్లో ఆహారకరంగా ఉంటుంది.



పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో

## ముర్షిదాబాద్ హింసలో బంగ్లాదేశీయుల ప్రమేయం...?

పశ్చిమ బెంగాల్ లోని ముర్షిదాబాద్ హింసలో బంగ్లాదేశీయుల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోల్‌కతా, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): వక్ఫ్ (సవరణ) చట్టం అమలుకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్లో నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ముర్షిదాబాద్లో హింసాత్మక పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నా ఫలితం కనిపించడం లేదు. అయితే.. దీని వెనక పొరుగు దేశమైన బంగ్లాదేశ్కు చెందిన వారి ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలోని జాతీయ రహదారి 12పై ఒక వర్గానికి చెందిన సమూహం పోలీసులపై రాళ్లదాడికి ప్రయత్నించగా.. మరోవైపు, ధూలియన్, షంషేర్ గంజ్, సుతీల్లో కొందరు విధ్వంసానికి పాల్పడ్డారు.



అయితే.. ఈ ప్రాంతం అంతర్జాతీయ సరిహద్దుకు సమీపంలో ఉండడంతో ఇతర ప్రాంతాలు లేదా పొరుగు దేశం బంగ్లాదేశకు చెందిన ఎవరైనా రాష్ట్రంలోకి ప్రవేశించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు మీడియా కథనాలు ప్రచురించింది. రాళ్ల దాడి చేసిన వారు ఎక్కువగా 20 ఏళ్ల లోపు వారేనని ఎమ్మెల్యే మనిరుల్ ఇస్లాం మీడియాకు తెలిపారు. కానీ, తానెప్పుడూ వారిని చూడలేదని పేర్కొన్నారు. "అల్లర్లు జరుగుతున్న ప్రాంతం సరిహద్దుకు సమీపంలో ఉంటుంది. కాబట్టి, అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఇది జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణిస్తున్నాం. బయటి వ్యక్తులు ఈ ప్రాంతంలోకి ప్రవేశించారనడంలో ఎలాంటి సందేహం లేదు. అది ఇతర జిల్లా లేదా పొరుగు దేశం నుంచి అయిన కావొచ్చు. ఈ అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. త్వరలోనే వాస్తవాలేంటో బయటపెడతాం" అని ఒక సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు యువకులను ఈ హింసలో భాగం చేశాయని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు మీడియాకు సమాచారం అందించాయి. జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. కాగా.. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్ లో గత వారం నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. నిరసనలు ఉద్రిక్తతగా మారడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు సహా పలువురికి గాయాలయ్యాయి. ఈ కేసులో ఇప్పటి వరకు 200 మందికి పైగా అరెస్టు చేశారు.

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేసు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు.

హైదరాబాద్, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): గ్లోబల్ బిజినెస్ హబ్ గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్ బాబుఅన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడారు. "దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేసన్ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఏర్పాటయ్యాయి.



2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు" అని శ్రీధర్బాబు అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా
# ఆర్డినెన్సు ఏపీ కేబినెట్ ఆమోదం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

అమరావతి, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్సు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

- విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం.
- ఉరుస క్లస్టరు కాపులుప్పాడలో 56 ఎకరాల భూమిని కేటాయింపు
- బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్కు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం.
- 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదం
- వివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ప్లాట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.



## పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు :సీఎం రేవంత్ రెడ్డి

పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) సమావేశం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కొనసాగుతోంది.

శంషాబాద్ నోవాటెల్ హోటల్లో జరుగుతున్న ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. "పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు" అని సీఎం తేల్చి చెప్పారు.



## రానున్న 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షం

రానున్న మూడు గంటల్లో ఆంధ్రప్రదేశ్లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

విశాఖ, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): రానున్న మూడు గంటల్లో ఆంధ్రప్రదేశ్లోని ఉత్తరాంధ్ర జిల్లాలు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఉరుములతో కూడిన వర్షం పడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు.



## దిల్లీలో మూడ్రోజులుంటే జబ్బు చేయడం ఖాయం:నితిన్ గడ్కరీ

దిల్లీలోని వాయు కాలుష్యంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు.

దిల్లీ, ఏప్రిల్ 14, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రస్థాయిలో ఉండటంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలో మూడ్రోజులుంటే జబ్బు చేయడం ఖాయమని అన్నారు. కాలుష్యం విషయంలో దిల్లీ, ముంబయి రెడ్జోన్లో ఉన్నాయని తెలిపారు. దిల్లీలో పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడి ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్లు తగ్గుతుందని.. వైద్య పరిశోధనను ఉటంకిస్తూ పేర్కొన్నారు.



ఇప్పటికైనా ప్రజలు మేల్కొని శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఏవిధంగా ప్రాధాన్యం ఇస్తామో అలాగే పర్యావరణాన్ని కూడా ముఖ్యమైన విషయాల్లో ఒకటిగా పరిగణించాలన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి రహదారుల మౌలిక సదుపాయాల కల్పన కూడా ఓ పరిష్కారంగా పని చేస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణాలు కాబట్టి వాహనాల్లో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమన్నారు. మనం దాదాపు రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్నామని.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలు వినియోగించాల్సిన సమయం వచ్చిందన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకువెళు న్న భారత్ రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టిపెడుతోందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16శాతం వరకు ఉన్నాయని.. 2026 చివరి నాటికి వాటిని సింగిల్ డిజిట్కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024 నివేదిక ఇటీవల విడుదలైంది. దీని ప్రకారం.. ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారత్లోనే ఉన్నాయి. అస్సాంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో దిల్లీ, ఇతర నగరాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు అంచనా వేసింది. 2009 నుంచి 2019 వరకు భారత్లో ప్రతి ఏడాది కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 1.5 మిలియన్ల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు గతేడాది విడుదలైన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 2012 : ప్రపంచ కళా దినోత్సవం
- 1452 : గణిత శాస్త్రజ్ఞుడు, చిత్రకారుడు, శిల్పకారుడు, వృక్షశాస్త్రజ్ఞుడు, సంగీత కళాకారుడు లియొనార్డో డావిన్సి జననం (మ. 1519). (చిత్రంలో)
- 1469 : భారత ఆధ్యాత్మిక గురువు, సిక్కుమత స్థాపకుడు గురునానక్ జననం (మ. 1539).
- 1707 : స్విస్ గణిత శాస్త్రవేత్త లియొనార్డ్ ఆయిలర్ జననం (మ. 1783).
- 1865 : అమెరికా పూర్వ అధ్యక్షుడు అబ్రహం లింకన్ మరణం (జ.1909).
- 1925 : గోదావరి జిల్లా, కృష్ణా జిల్లాలను విడదీసి, పశ్చిమ గోదావరి ప్రత్యేక జిల్లాగా ఏర్పరిచారు. అప్పటినుండి, గోదావరి జిల్లా తూర్పు గోదావరి జిల్లాగా పేరు మార్చుకొంది.




ప్రపంచ కళా దినోత్సవం



లియొనార్డో డావిన్సి


గురునానక్


లియొనార్డ్ ఆయిలర్


అబ్రహం లింకన్



పశ్చిమ గోదావరి


తూర్పు గోదావరి జిల్లా

రిపబ్లిక్ స్పోర్ట్స్

# అంతా పంతే చేశాడు!

సోమవారం లఖ్ నవూ సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్కు మధ్య జరిగిన మ్యాచ్లో ధోనీ సేన విజయం సాధించింది. ఉత్కంఠగా జరిగిన ఈ పోరులో కెప్టెన్గా అనుభవ లేమితో రిషభ్ పంత్ తీసుకున్న ఓ నిర్ణయం బెడిసికొట్టింది. చెన్నై చేతిలో లఖ్ నవూ పరాజయం పాలయ్యేలా చేసింది.




లఖ్ నవూ సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్కు మధ్య సోమవారం జరిగిన ఉత్కంఠ పోరులో ధోనీ సేన విజయం సాధించింది. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్లో కెప్టెన్గా అనుభవలేమితో బౌలర్ల ఎంపికలో రిషబ్ పంత్ తీసుకున్న ఓ నిర్ణయం బెడిసి కొట్టింది. చెన్నై చేతిలో లఖ్నవూ పరాజయం పాలయ్యేలా చేసింది. చక్కగా బౌలింగ్ చేస్తున్న రవి బిష్ణోయ్కు ఆఖరి ఓవర్లలో బంతి ఇవ్వకుండా పంత్ పేసర్ల వైపు మొగ్గు చూపాడు. ఈ వ్యూహాత్మక తప్పిదమే లఖ్నవూ సూపర్ కింగ్స్ పరాజయానికి కారణమైందని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. చెన్నై విజయానికి చివరి నాలుగు ఓవర్లలో 44 పరుగులు అవసరమైన వేళ క్రీజులో ఎంఎస్ ధోనీ, శివమ్ దూబే ఉన్నారు. ఈ సమయంలో కెప్టెన్గా రిషభ్పంత్ తీసుకున్న నిర్ణయాల్లో ఒత్తిడి, అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. అప్పుడు అవేశ్ ఖాన్, శార్దూల్ ఠాకూర్ బౌలింగ్ వేయించాడు. కానీ అప్పటివరకు మూడు ఓవర్లు వేసి కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు నేల కూల్చిన రవి బిష్ణోయ్ చేతికి బంతిని కూడా ఇవ్వలేదు. ఇంతకు ముందు కోల్కతా నైటైడర్స్లో చెన్నై సూపర్కింగ్స్కు జరిగిన మ్యాచ్లో ధోనీని కేవలం 1 పరుగుకే సునీల్ నరైన్ తన అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యూ చేసి పెవిలియన్కు పంపాడు. ఈ మధ్య ధోనీ పేస్ను ఆడుతున్నంత అలవోకగా స్పిన్ను ఎదుర్కోలేకపోతున్నాడు. పంత్ కనీసం ఈ విషయాన్నీ గుర్తించకుండా ఆఖర్లో పేస్ వైపే మొగ్గు చూపాడు. బంతిని రవి బిష్ణోయ్కు ఇచ్చిఉంటే మాత్రం ఏదైనా మ్యాజిక్ జరిగి ఉండేదేమో! చక్కటి రిథమ్లో బంతులు సంధించిన ఈ లెగ్ స్పిన్నర్తో పూర్తి కోటా ఓవర్లు వేయించకపోవడం నిజంగా పంత్ చేసిన పెద్ద తప్పిదమే అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రవి బిష్ణోయ్ మాట్లాడాడు. 'డెత్ ఓవర్లలో నేను బౌలింగ్ చేస్తాను అని పంత్ను అడగలేదు. కానీ కెప్టెన్ నన్ను గమనించి బంతిని నాకు అందించాలనే ఆశతో మధ్యలో రెండుసార్లు పిచ్ వైపు వెళ్లాను. కానీ అది జరగలేదు. పంత్ వేరే ప్రణాళికలతో ఉన్నాడేమో అని అనుకున్నాను. ఇక మహీభాయ్ గురించి ప్రత్యేకంగా చెప్పేది ఏముంది? బంతి అతని రాడార్లో ఉంటే, అందులోనూ తనకు కలిసివచ్చిన రోజున అతడు ఆకాశమే హద్దుగా చెలరేగుతాడు' అని రవి బిష్ణోయ్ అన్నాడు.

## వెకేషన్ నుంచి వచ్చిన మహేశ్..
# ఎస్ఎస్ఎంబి29 షూటింగ్ షురూ!

కుటుంబంతో కలిసి ఇటలీ వెళ్లిన మహేశ్ హైదరాబాద్కు వచ్చేశారు. విమానాశ్రయంలో అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు.




ప్రస్తుతం సినీ ప్రియులంతా ఎదురుచూస్తోన్న ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబి29. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం సెట్స్లో ఉంది. ఇటీవలే ఓ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. దీని తర్వాత టీమ్ విరామం తీసుకుంది. మహేశ్, రాజమౌళి ఇద్దరూ విదేశాలకు వెళ్లారు. అలాగే ప్రియాంక కూడా ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. తాజాగా మహేశ్ బాబు ఇటలీ వెకేషన్ నుంచి తిరిగి వచ్చారు. కుటుంబంతో కలిసి రోమ్కు వెళ్లిన ఆయన ఈరోజు ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. విమానాశ్రయంలో అభిమానులతో కలిసి ఫొటోలు దిగారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక రాజమౌళి కూడా ఇటీవలే జపాన్ వెళ్లారు. 'ఆర్ఆర్ఆర్: బిహైండ్ అండ్ బియాండ్' డాక్యుమెంటరీ ప్రచారం కోసం కుటుంబసమేతంగా జపాన్ వెళ్లారు. ఆయన కూడా వచ్చాక ఈ సినిమా మరో షెడ్యూల్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఒడిశాలో ఈ సినిమా ఓ షెడ్యూల్ పూర్తిచేసుకొంది. సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్సేల్, బాల్డ ప్రాంతాల్లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. మహేశ్తో పాటు పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా తదితరులు ఈ షూటింగ్ పాల్గొన్నారు.

## నిన్న చెట్టెక్కి.. నేడు జిమ్ చేస్తూ.. ట్రోల్స్కు చెక్ పెడుతోన్న స్టార్ హీరో!

జిమ్ చేస్తోన్న ఫొటోలను సల్మాన్ ఖాన్ షేర్ చేశారు. ఆ ఫొటోలకు పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది.





బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఫిట్గా లేరంటూ కొందరు నెటిజన్లు ట్రోల్ చేసిన సంగతి తెలిసిందే. వీటికి చెక్ పెడుతూ ఆయన ఇటీవల చెట్టు ఎక్కారు. తాజాగా జిమ్ చేస్తోన్న ఫొటోలను పోస్ట్ చేశారు. ప్రస్తుతం అవి వైరల్ గా మారాయి. బాలీవుడ్ హీరోలు ఈ ఫొటోలపై స్పందిస్తూ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ పిక్స్ షేర్ చేసిన సల్మాన్ "నాలో స్ఫూర్తినింపుతున్నందుకు మీకు ధన్యవాదాలు" అని క్యాప్షన్ పెట్టారు. దీని గురించి కూడా ప్రస్తుతం నెట్టింట చర్చ జరుగుతోంది. తాజాగా సల్మాన్కు మరోమారు బెదిరింపులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన క్యాప్షన్ చర్చనీయాంశంగా మారింది. సల్మాన్ను చంపేస్తామంటూ వర్లీ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్కు తాజాగా ఒక వాట్సాప్ సందేశం వచ్చింది. సల్మాన్ ఇంట్లోకి చొరబడి కాల్పులు జరుపుతామని, లేదంటే కారులో బాంబు పెట్టి పేల్చేస్తామని అందులోని సారాంశం. ఈ సందేశం గురించి తెలుసుకున్న ముంబయి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. సందేశాన్ని పంపిన వ్యక్తిని కనిపెట్టే పనిలో పడ్డారు. ఇక సల్మాన్ ఖాన్ నటించిన రీసెంట్ మూవీ 'సికందర్' ఇటీవల విడుదలై మిశ్రమ స్పందనలకే పరిమితమైన విషయం తెలిసిందే.

రిపబ్లిక్ సినిమా CINEMA

## లారెన్స్ వదులుకున్నారు...
## విజయ్ సేతుపతి అందుకున్నారు!

రాఘవ లారెన్స్ నటించాల్సిన ఓ పాత్రను విజయ్ సేతుపతి పోషించి, ప్రేక్షకులను విశేషంగా అలరించారు. తన ఖాతాలో మరో విజయాన్ని అందుకున్నారు. అది ఏ పాత్ర? ఏ సినిమా అంటే?





ఒకరు నటించాల్సిన పాత్రను మరొకరు పోషించడమనేది చిత్ర పరిశ్రమలో సాధారణం. ఒక్కొక్కరూ ఒక్కో కారణం వల్ల తమ దగ్గరకు వచ్చిన అవకాశాలను తిరస్కరిస్తారు. వేరొకరు ఆ ఛాన్స్ సద్వినియోగం చేసుకుంటారు. ఆ జాబితాలోకే వస్తారు రాఘవ లారెన్స్, విజయ్ సేతుపతి అది ఏ పాత్ర చిత్రంలోని సంతానం. కమల్ హసన్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకున్న సంగతి తెలిసిందే. ఏజెంట్ అరుణ్కుమార్ విక్రమ్గా కమల్, ఏజెంట్ అమర్గా ఫహద్ ఫాజిల్, సంతానం క్యారెక్టర్లో విజయ్ సేతుపతి ఒదిగిన తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. విభిన్నమైన మ్యానరిజంతో సేతుపతి సర్ప్రైజ్ చేశారు. నెగెటివ్ ఛాయలున్న ఆ క్యారెక్టర్కు సేతుపతి తప్ప మరొకరు న్యాయం చేయలేరేమో అని అనిపించేంతగా యాక్ట్ చేశారు. ఇదే రోల్ లారెన్స్ ప్లే చేసుంటే ఎలా ఉండేదో ఊహించుకోండి. ఎందుకంటే.? సంతానం పాత్ర కోసం దర్శకుడు లోకేశ్ ముందుగా లారెన్స్నే సంప్రదించారు. అదే సమయంలో.. ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండడం, డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో లారెన్స్ నటించడం కుదరదని చెప్పారు. దాంతో, లోకేశ్.. విజయ్ సేతుపతిని తీసుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ఈ విశేషాలు పంచుకున్న లారెన్స్.. "నేనూ లోకేశ్ ఎప్పటి నుంచో కలిసి పనిచేయాలనుకుంటున్నాం. భవిష్యత్తులో అది జరగొచ్చు. ప్రస్తుతానికి లోకేశ్ రాసిన ఓ కథలో నేను నటించబోతున్నా. దానికి అతడి అసిస్టెంట్ దర్శకత్వం వహించనున్నాడు" అని తెలిపారు.

## ఆరోగ్యం

మామిడి పండును కొందరు డైరెక్ట్గా తింటే.. మరికొందరు జ్యూసులు, స్మూతీల రూపంలో తీసుకుంటారు. మామిడి పండు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే, కొన్ని ఆహారాలను మామిడి పండు తిన్న తర్వాత తినకూడదు.

## పొరపాటున కూడా మామిడిపండు తిన్న తర్వాత కొన్ని ఫుడ్స్ తినొద్దు, కడుపులో చికాకుతో పాటు జీర్ణక్రియ పాడవుతుంది

వేసవి కాలం ప్రారంభమైంది. ఎండల సంగతి పక్కన పెడితే ఈ సీజన్ చాలా మందికి ఇష్టం. ఎందుకంటే ఈ సీజన్లో నోరూరించే మామిడి పండు దొరుకుతుంది. మండే ఎండల్లో మామిడి పండును తినడానికి చాలా మంది ఇష్టపడతారు. నోటికి రుచిగా, తీపిగా ఉండే మామిడి పండును చిన్న, పెద్దా తేడా లేకుండా అందరూ లాగించేస్తారు. అందుకే మామిడి పండును పండ్లలో రారాజు అని పిలుస్తారు. మామిడి పండును కొందరు డైరెక్ట్గా తింటే.. మరికొందరు జ్యూసులు, స్మూతీల రూపంలో తీసుకుంటారు. మామిడి పండు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. అయితే, కొన్ని ఆహారాలను మామిడి పండు తిన్న తర్వాత తినకూడదు. తింటే కడుపు సమస్యలతో బాధపడతారని నోయిడాలోని జు-260 సెక్టార్ 27లో ఉన్న 'కపిల్ త్యాగి ఆయుర్వేద క్లినిక్' డైరెక్టర్ డాక్టర్ కపిల్ త్యాగి చెప్పారు. ఇంతకీ ఆ ఫుడ్స్ ఏంటంటే..





### పెరుగు




మామిడికాయ తిన్న వెంటనే పెరుగు తినకూడదు. ఇలా చేయడం వల్ల, కడుపులో కార్బన్ డయాక్సైడ్ పరిమాణం చాలా పెరుగుతుంది. ఇది కడుపు నొప్పి వంటి సమస్యలను కలిగిస్తుంది. ఈ కాంబినేషన్ ఎక్కువకాలం తీసుకుంటే.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. పొత్తికడుపు నొప్పి, వికారం, అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం, అల్సర్లు, శరీరం చెడు వాసన, మలబద్ధకం, చర్మ సమస్యలు, కడుపు సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### సిట్రస్ ఫ్రూట్స్



మామిడిపండు, సిట్రస్ ఫ్రూట్స్ కాంబినేషన్ కూడా ఆరోగ్యానికి మంచిది కాదని డాక్టర్ చెబుతున్నారు. పొరపాటున కూడా మామిడిపండుతో నిమ్మ, నారింజ, గ్రేప్ ఫ్రూట్ వంటి సిట్రస్ పండ్లను తినకూడదని చెబుతున్నారు. ఈ కాంబినేషన్ శరీరంలోని పిహెచ్ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది. ముఖ్యంగా మామిడి, సిట్రస్ ఫ్రూట్స్ కలిపితినడం వల్ల జీర్ణక్రియకు అటంకం కలుగుతుంది. దీంతో కడుపులో నొప్పి, మంట, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే ఈ ఫుడ్ కాంబినేషన్ అవాయిడ్ చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

### స్పైసీ ఫుడ్స్



మామిడి పండు తిన్న వెంటనే కారంగా ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలని డాక్టర్ సూచిస్తున్నారు. మాడిడి తిన్న వెంటనే స్పైసీ ఫుడ్స్ ఫుడ్స్ తినడం వల్ల ఎసిడిటీ, గుండెల్లో మంట, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. అందుకే మామిడి పండుతో పాటు స్పైసీ, మసాలా ఫుడ్స్ తినకూడదని నిపుణులు చెబుతున్నారు. మామిడి తిన్న తర్వాత వెంటనే అలాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది.

### కాకరకాయ




మామిడిపండుతో పాటు లేదా తిన్న వెంటనే కాకరకాయకి సంబంధించిన ఆహారాలు తినకపోవడమే మేలు అంటున్నారు డాక్టర్. ఈ కాంబినేషన్ కడుపు ఆరోగ్యానికి మంచిది కాదు. కడుపు నొప్పి, అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. ఆయుర్వేదం ప్రకారం ఈ రెండు ఆహారాలను కలిపితే, అది వికారం, వాంతులకు కారణమవుతుంది.

### కూల్డ్రింక్స్



చాలా మంది వేసవిలో చేసే పొరపాటు ఇదే. మామిడిపండు తిన్న వెంటనే చాలా మంది కూల్డ్రింక్స్ తాగుతుంటారు. అయితే, ఈ కాంబినేషన్ చాలా డేంజర్. మామిడికాయ తిన్న తర్వాత అస్సలు కూల్ డ్రింక్స్ తాగకూడదు. ఇది మీ జీర్ణక్రియను చెడగొట్టవచ్చు. జలుబు, దగ్గు వంటి సమస్యలతో పాటు కడుపు ఆరోగ్యం చెడిపోయే ప్రమాదముంది. అందుకే ఈ కాంబినేషన్ అవాయిడ్ చేయాలని డాక్టర్ సూచిస్తున్నారు.

### నీరు



మామిడిపండు తిన్న వెంటనే నీరు తీసుకోకూడదని ఆయుర్వేద డాక్టర్ చెబుతున్నారు. ఎందుకంటే మామిడిపండులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. పొరపాటున మామిడిపండు తిన్న తర్వాత నీరు తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్ ఏర్పడి ఇబ్బందులు ఎదుర్కొంటారు. అంతేకాకుండా కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు అయ్యే అవకాశం కూడా ఉంది. అందుకే మామిడిపండు తిన్న తర్వాత అరగంట పాటు నీరు తాగకూడని డాక్టర్ చెబుతున్నారు.

**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.